క్లుప్తంగా

ఘనంగా శంకర జయంతి



ఆలయ ప్రాంగణంలో భజన చేస్తున్న భక్తులు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులోని అసంగానంద ఆశ్రమం ప్రాంగణంలో నిర్మించిన మృత్యుంజయేశ్వర ఆలయ సముదాయంలో శంకర జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆదిశంకరుల విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఆధ్యాత్మిక గీతాలాపన, భజన కార్యక్రమం నిర్వహించారు.

తరలిన విద్యార్థులు.. వర్సిటీ నిర్మానుష్యం



నిర్మానుష్యంగా ఏయూ పరిపాలన భవనానికి వెళ్లే మార్గం

ఏయూ క్యాంపస్: ఓటు వేసేందుకు విద్యార్థులు తమ స్వగ్రామాలకు తరలిపోవడంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం బోసిపోయింది. వర్సిటీ రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. నార్త్ క్యాంపస్‌ను పూర్తిగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు వినియోగిస్తున్నారు. సౌత్ క్యాంపస్ మాత్రం విద్యార్థులు లేక బోసిపోయింది. దీనికి తోడు రెండో శనివారం, ఆదివారం కలసి రావడంతో వర్సిటీ మొత్తం ఖాళీ అయిపోయింది. వర్సిటీ ఉద్యోగులు సైతం ఎన్నికల విధులకు వెళ్లిపోయారు.

శిష్టకరణాల మద్దతు వైఎస్సార్‌సీపీకే

బీచ్ రోడ్డు: శిష్ట కరణాల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు ఓబీసీలో చేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేసిన కృషికి కృతజ్ఞతగా ఈ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని శిష్టకరణాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ పిలుపునిచ్చారు. కష్టంలో ఉన్నామని గుర్తించిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి శిష్టకరణాలను బీసీలోకి చేర్చారని గుర్తు చేశారు. ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికాభివృద్ధితో పాటు రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన వారిని మళ్లీ గెలిపించుకోవడం మన బాధ్యత అని ఆమె తెలిపారు.

వానప్రస్థ వృద్ధాశ్రమంలో మాతృ దినోత్సవం



వానప్రస్థ వృద్ధాశ్రమంలో మహిళను సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు సేవ చేస్తూ కమ్మని ఆహార పదార్థాలు వండి పెడుతున్న మహిళను సత్కరించి చీర, నగదు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జయ, కోశాధికారి షీలారాణి, పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓటుకు వేళాయె

- తూర్పులో 293 పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు
- ఆయా కేంద్రాలకు చేరిన ఈవీఎంలు, మెటీరియల్
- ముందుగానే చేరుకున్న సిబ్బంది

తూర్పు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు :	2,92,206
పురుషులు :	1,42,540
మహిళలు :	1,49,646
ఇతరులు :	20
పోలింగ్ కేంద్రాలు :	293



తోటగరువు హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులకు సూచనలు చేస్తున్న ఆరిలోవ సీఐ గోవిందరావు



ఆరిలోవ సెయింట్ ఆన్స్ స్కూల్‌లో పోలింగ్ కోసం ఏర్పాట్లు చేసిన టెంట్లు

ఆరిలోవ: సాధారణ ఎన్నికలకు విశాఖ తూర్పు నియోజకవర్గం సిద్ధమైంది. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందిలేకుండా ఎన్నికల అధికారులు, పోలీసులు పోలింగ్ బూత్‌ల వద్ద తగిన ఏర్పాట్లు చేశారు. పోలీసులు సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్టమైన చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి సౌకర్యం, కుర్చీలు, బెంచీలు సిద్ధం చేశారు. మూడో పట్టణ, ఎంవీపీ, ఆరిలోవ పోలీసులు తమ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు.

నియోజకవర్గంలో 293 బూత్‌లు

నియోజకవర్గంలో 15 వార్డులున్నాయి. వాటిలో 282 బూత్‌లున్నాయి(పోలింగ్ స్టేషన్‌లు). వాటికి మరో 11 అనుబంధ బూత్‌లు జత చేశారు. నియోజకవర్గంలో జోన్-2 పరిధి 49 ప్రాంతాలలో 95 బూత్‌లు, జోన్-3 పరిధి 59 ప్రాంతాలలో 178 బూత్‌లు ఉండగా.. జోన్-4 పరిధి 9 ప్రాంతాలలో 20 బూత్‌లు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ బూత్‌లో నలుగురు ఓపీవోలు, ఒక ఏపీవో, ఒక పీవో ఉంటారు.

ఓటు వేయడానికి అవసరమైన గుర్తింపు కార్డులు..

ఓటు వేయడానికి వెళ్లేటప్పుడు ఓటరు ఓటు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, సర్వీస్ ఐడీ కార్డు(ప్రభుత్వం జారీ చేసినది), పాస్ ఫొటోతో కూడిన పాస్‌బుక్(బ్యాంకు పాస్‌బుక్), పాన్ కార్డు, ఆధార్‌కార్డు తదితర 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తీసుకువెళ్లాలి. తీసుకువెళ్లిన కార్డును పోలింగ్ బూత్‌లో ఎన్నికల సిబ్బందికి చూపించాలి.

22వ వార్డులో 18 పోలింగ్ కేంద్రాలు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 22వ వార్డులో మొత్తం 18 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఏయూ పాఠశాల, చినవాల్తేరు ప్రభుత్వ పాఠశాల, శాంతి ఆశ్రమం, ఓంకార్ పాఠశాల, నౌకా నగర్ పాఠశాల, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల, ప్యాలస్ లే అవుట్, కేడీపీఎం పాఠశాల, గిరిజన్ భవన్‌లో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వార్డులో మొత్తం 17,448 మంది ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: చినవాల్తేరు, ఏయూ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంల ఏర్పాటు, ఇతర పనులను సమన్వయంతో పూర్తి చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు ఆరుగురు సిబ్బందిని నియమించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 21, 22, 28 వార్డుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని సదుపాయాలు కల్పించారు. రేసపువానిపాలెం, చిన్నవాల్తేరు స్కూల్‌లోని కేంద్రాల వద్దకు ఎన్నికల సామగ్రిని అధికారులు చేర్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు భద్రతతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఎంవీపీ కాలనీలో

ఎంవీపీ కాలనీ: సార్వత్రిక ఎన్నికల కోసం ఎంవీపీ కాలనీ పరిధిలో పోలింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 7 నుంచి పోలింగ్ ప్రారంభం కానుండడంతో ఎన్నికల సిబ్బంది పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. 17, 18, 19 వార్డుల పరిధిలో 65 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అన్ని చోట్ల పోలింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకొని అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. జాలరిపేటలో ఒక పోలింగ్ బూత్ పరిధిలో 1200 నుంచి 1500 వరకు ఓట్లు ఉండటంతో అందుకు తగ్గట్టుగా ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నారు. జాలరిపేటలోని పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో ఉండటంతో పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసు భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రత్యేక బెటాలియన్స్‌ను అత్యవసర సేవల కోసం అక్కడ అందుబాటులో ఉంచారు.

కృష్ణా కళాశాలలో అత్యధికంగా 22 పోలింగ్ బూత్‌లు

మద్దిలపాలెం : తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో 22 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలలో 23, 16వ వార్డులకు చెందిన ఓటర్లు ఓటు వేయనున్నారు. జీవీఎంసీ 15వ వార్డు వెంకోజీపాలెంలో జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నీడ కోసం టెంట్, మంచి నీటి సదుపాయం, పోలింగ్ సిబ్బంది కావాల్సిన బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 16వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఈ వార్డులోని రజకవీధి అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్‌లో పోలింగ్ కేంద్రాలున్నాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బరిలో 14 మంది అభ్యర్థులు

నియోజకవర్గం నుంచి 14 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్రులుగా పలువురు పోటీ పడుతున్నారు.

అభ్యర్థి	పార్టీ
ఎంవీవీ సత్యనారాయణ	వైఎస్సార్‌సీపీ
వెలగపూడి రామకృష్ణబాబు	తెలుగుదేశం
గుత్తుల శ్రీనివారావు	జాతీయ కాంగ్రెస్
పీటర్ జోసెఫ్	బహుజన సమాజ్ పార్టీ
ఇ.హైమావతి	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా
తోట వెంకటసాయి ముకుంద	ప్రజా ప్రస్థానం పార్టీ
యెడ్ల వేణుగోపాల కృష్ణ	భారత యువజన చైతన్య పార్టీ
డాక్టర్ కొంగరాపు గణపతి	రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా
అదపాక దాలిరాజు	నవభారత నిర్మాణ సేవా పార్టీ
ఆదాడ రమణి	స్వతంత్ర అభ్యర్థి
ఉమ్మడి భాస్కరరావు	స్వతంత్ర అభ్యర్థి
శివరామకృష్ణ అనగాని	స్వతంత్ర అభ్యర్థి
బర్ల అప్పారావు	స్వతంత్ర అభ్యర్థి
వడ్డి శిరీష	స్వతంత్ర అభ్యర్థి



చినవాల్తేరు పోలింగ్ కేంద్రం



ఏయూ పాఠశాలలో పోలింగ్ కేంద్రం



కృష్ణా కళాశాల పోలింగ్ కేంద్రంలో మంచినీటి సదుపాయం



కృష్ణా కళాశాల పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన బెంచీలు



కృష్ణా కళాశాల పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు



కృష్ణా కళాశాలలో బూత్‌లు ఉండే ప్రాంతాలు సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డులు



రేసపువానిపాలెం పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



రేసపువానిపాలెంలో పోలింగ్ బూత్‌లో సిద్ధమైన సామగ్రి



జాలరిపేటలోని పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది



పోలింగ్ స్టేషన్‌లో అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది

ఏయూలో ఎన్నికల కోలాహలం

- పక్కాగా సామగ్రి పంపిణీ
- పటిష్ట ఏర్పాట్లు చేసిన యంత్రాంగం



ఎన్నికల మెటీరియల్‌ను సరిచూసుకుంటున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల సందడి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో కనిపించింది. ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో తొలి దశ అయిన సామగ్రి పంపిణీ కార్యక్రమం ఆదివారం ఉదయం వర్సిటీలో ప్రారంభమైంది. పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం ప్రత్యేకంగా ఏడు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేర్వేరు ప్రాంతాలలో నియోజకవర్గాల వారీగా వీటిని కేటాయించారు. భారీ టెంట్‌లు నిర్మించి వాటిలో పోలింగ్ బూత్‌ల వారీగా పోలింగ్ సామగ్రి పంపిణీ చేపట్టారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ విధులు నిర్వర్తించే సిబ్బంది తమకు కేటాయించిన నియోజకవర్గం పోలింగ్ పంపిణీ కేంద్రాలకు చేరుకుని సామగ్రిని తీసుకున్నారు. పోలింగ్ సిబ్బంది తమ సొంత వాహనాల్లో ఏయూ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకున్నారు. రహదారికి రెండు వైపులా వాహనాలు పార్క్ చేయడంతో కొంత ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు వెంటనే స్పందించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

ఏయూ మైదానంలో బస్సుల పార్కింగ్

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందిని తరలించడానికి అవసరమైన బస్సులు, కార్లు, మాక్సీ వాహనాలను పార్కింగ్ చేశారు. వీటిపై నియోజకవర్గం పేరు, రూట్ నంబరు, పోలింగ్ స్టేషన్ల నంబర్లు ముద్రించిన బ్యానర్లను అతికించారు. దీంతో సులభంగా ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన వాహనాలను గుర్తించి వెళ్లారు. పోలింగ్ మెటీరియల్ తీసుకోవడానికి వచ్చిన సిబ్బందికి అక్కడే భోజనాలు ఏర్పాటు చేశారు.

సమన్వయంతో సమర్థవంతంగా..

ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ ఎంతో సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. మైక్‌లో సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పోలింగ్ కేంద్రాల వద్ద సహాయం చేశారు.



భోజనం చేస్తున్న ఎన్నికల సిబ్బంది



తూర్పు నియోజకవర్గం ఎన్నికల మెటీరియల్ పంపిణీ చేస్తున్న ప్రాంగణం



పంపిణీకి సిద్ధం చేసిన సామగ్రి



ఎన్‌సీసీ వలంటీర్లకు సూచనలు చేస్తున్న పోలీసు అధికారులు

ప్రగతి సంతకం

ఐదేళ్లలో గణనీయ అభివృద్ధి

అభివృద్ధి ఏ ఒక్క అంశానికో, ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకూడదు. ప్రతీ చోట ప్రగతి పరవళ్లు తొక్కాలి. ప్రతీ కుటుంబంలో సంక్షేమ కాంతులు వెల్లివిరియాలి. ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రతీ విద్యార్థి ఉన్నత చదువులు చదవాలి. ఏ ఒక్క నిరుపేదకు వైద్యం అందని పరిస్థితి ఉండకూడదు. ప్రతీ ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందాలి. రహదారులు ప్రగతి మార్గాలు కావాలి.. ప్రజలకు పాలన చేరువ కావాలి.. మహిళా సాధికారత ప్రతిఫలించాలి. ఇదంతా సాధ్యమేనా అనే ప్రశ్నే లేకుండా ఐదేళ్ల పాలనలో ఇవన్నీ కళ్లముందు సాక్షాత్కరింపజేశారు. ఫలితంగా ప్రతీ ఇల్లు ఆనందాల పొదరిల్లులా మారింది. అంతటా అభివృద్ధి వెలుగురేఖలు ప్రసరించాయి. నిదర్శనమిదీ.. – ఆరిలోవ



నాడు : చినగదిలి నుంచి సూర్యతేజనగర్ వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు



నేడు : చినగదిలి నుంచి సూర్యతేజనగర్ వరకు విస్తరించిన రహదారి



నాడు : ఇరుకుగా ఉన్న విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డు



నేడు : విస్తరించిన విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డు



నాడు : రామకృష్ణాపురంలో ఎత్తు తక్కువ కారణంగా ముంపునకు గురయ్యే వంతెన



నేడు : రామకృష్ణాపురంలో నిర్మించిన వంతెన



నాడు : వైఎస్సార్ వ్యూ పాయింట్ నుంచి సీతకొండ చివర వరకు ఇరుకుగా ఉన్న రోడ్డు



నేడు : వైఎస్సార్ వ్యూ పాయింట్ నుంచి సీతకొండ చివర వరకు అభివృద్ధి చేసిన రోడ్డు

వైభవంగా త్యాగరాజ స్వామి జయంత్యుత్సవం



శ్రీరామగానామృతం బృంద గానం

మద్దిలపాలెం : త్యాగరాజ స్వామి జయంత్యుత్సవాలను మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఐవీఎస్ శాస్త్రీ సంగీత సమితీ ఆధ్వర్యంలో ఆకొండి వెంకటరావు శిష్య బృందం ఆలపించిన శ్రీరామ గానామృతం హృద్యంగా సాగింది. ఈ వేడుకలను త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి వివోక్షానంద మహారాజ్ ప్రారంభించారు. అనంతరం ఆకొండి వెంకటరావు రూపకల్పన చేసిన భజనమంజరి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.